# లేత గులాబీలు

సాయంకాలం అయిదుగంటలయింది. అప్పుడే కాలేజీ నుంచి వచ్చి వాలుకుర్చీలో కూర్చుని కాలక్షేపానికి ఏదో పుస్తకం తీశాను.

కిటికీలోంచి పిల్లలగోల చెవుల్ని చిల్లులు చేస్తుంటే అటు తిరాగాను వాళ్ళ గోలకి కారణం తెలిసింది. "ఇవాళ ప్రవేటు లేదు గానీ - ఇక్కడే ఆడుకోండీ" అనటంచేత

సాధారణంగా రామం మాస్టారు ప్రవేటుకి ఎగనామం పెట్టరు ఆయనకు అదే వృత్తి అవటం అందుక్కారణం అవునో, కాదో గానీ నాకు తెలిసిన నిజం మాత్రం అది. తెలీని వాళ్ళు ఆ గుమ్మం ఓ చిన్నసైజు కాన్వెంట్ అనుకుంటారు. ఆయన దగ్గర చదువుకున్న వాళ్ళు ఎలాటి ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదివిన పిల్లల్నయినా జయించగలరని ప్రతీతి.

మాస్టారు వెళ్ళిపోయాక పిల్లలు రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు. వాళ్ళనీ, వాళ్ళాటల్ని చూస్తుంటే నా గుండెల్లో బరువంత హుష్‌కాకి అయిపోయింది. మా ఫ్రెండ్ ఓ కవి రాసిన మాటలు గుర్తుచ్చాయి. 'భగవంతుడు కనిపించి నీకేం కావాలంటే అయిదేళ్ళకు మించి పెరగని పసితనం నాకు ప్రసాదించు స్వామి అంటాను.' అని అతను నన్ను కలసినపుడల్లా మనుషులూ కలుషిత రాజకీయాలూ, వీటి గురించి మాట్లాడి చివరకు కోపం ఆపుకోలేక అలా అంటుంటాడు.

ఇప్పుడనిపిస్తోంది అతని మాటల్లో ఎంత నిజం ఉందో, పిల్లల మనసులను అతడెంత నిశితంగా పరిశీలించాడోనని!

ఆలోచిస్తున్నానే గాని నా దృష్టంతా వాళ్ళాటల మీదే వుంది. ఆ పిల్లల్లో కాస్తంత పెద్దమ్మాయి లేచింది. "ఏయ్ పిల్లలూ మీరంతా నిశ్శబ్దంగా వుంటే ఇప్పుడు కొన్ని నాటికలు చూడొచ్చు అంది.

ఆ పిల్లకి ఆరేళ్ళుంటాయేమో! అక్కడున్న ఓ స్టూలు తెచ్చి దాన్ని గోడకు చేరవేసింది. ఎదురుగా ఓ పొడుగాటి బల్లవేసింది. "ఇదిగో నేను మాస్టార్ని అంటే మన స్కూల్లో వున్న సోమయాజుల మాస్టార్ని నేను క్లాసులోకి వచ్చే సరికి మీరంతా నిలబడాలి" అంది.

అలాగే నండి అంటూ మిగిలిన పిల్లలంతా ఆ పిల్లకి అప్పుడే మాస్టారి గౌరవం ఇచ్చేశారు. ఇక్కడ నుండి ఆ పిల్ల మాస్టారిగా నటిస్తుందన్నమాట. పిల్లలంతా లేచి నిల్చున్నారు.

"కూర్చోండి, కూర్చోండి" అన్నారు మాస్టారు (అంటే ఆ పిల్ల) కొంతసేపు మాస్టారు కళ్ళద్దాలు సవరించుకున్నారు. తరువాత ముందు బెంచీ మీద కాళ్ళేసి కూర్చున్నారు.

"ఒరేయ్ గోపీ ఇలారా" అని కేకేశారు.

జేబులోంచి డబ్బులు తీసి, ఇస్తూ "ఉరేయ్ మంచి టీ ఒహటి పట్రమ్మా" అన్నారు. ఆ

కుర్రాడి తో పాటు మరో ముగ్గురు పిల్లలు పరుగు తీశారు.

వాళ్ళు వెళ్ళాక "అరే మర్చిపోయానర్రా" అన్నారు మాస్టారు. "ఏమిటండీ" "ఓ అర్థరూపాయి పోడుంకూడా తీసుకురావాలర్రా".

"మేం తెస్తాం డబ్బులివ్వండి" అన్నారు పిల్లలు ఏ గ్రీవంగా మాస్టారు జేబులు తడిమి అరే చిల్లర లేదే అన్నారు. "నా దగ్గరున్నాయండీ నే తెస్తాను" అంటూ పిల్లలు తుర్రున పారిపోయాడు.

ఆ తరువాత "ఒరే సూరిగా! ఇలారా! ఈ కాళ్ళు తెగసలిపేస్తున్నాయనుకో ఓసారి ఒత్తుతావా! అన్నారు.

ఓ ఇద్దరు పిల్లలు కాళ్ళు ఒత్తడం మొదలుపెట్టారు. అటూ, ఇటూ, మరో ఇద్దరు పిల్లలు నిల్చొని కాంపోజిషన్ పుస్తకాలు విసనకర్రలుగా చేసి విసురుతున్నారు.

ఇంతలో టీ వచ్చింది. పొడుం వచ్చింది. మాస్టారు టీ త్రాగేసి పొడుం దట్టించారు. తర్వాత ఓ తెలివైన కుర్రాణ్ణి పిలిచి ఎక్కాలు చెప్పమన్నారు. వాడు చెపుతుంటే మిగిలిన వాళ్ళంతా పెంకులెగిరేటట్లు వల్లిస్తున్నారు.

మాస్టారు గుర్రు పెట్టి నిద్ర పోసాగారు. అంటే ఇక్కడ-ఆ పిల్ల ఎంత అద్భుతంగా నటించిందో రాస్తే అతిశయోక్తి అనిపిస్తుందేమో! అయితే పిల్లల గోలకి మాస్టారుకి వెంటనే తెలివొచ్చేసింది. మాస్టారు కాసేపు మత్తుగా చూసి అందర్ని ఇళ్ళకు పొమ్మన్నారు.

అక్కడకి ఆ నాటికయిపోయినట్లుంది.

తర్వాత మరికొంత మంది పిల్లలొచ్చి 'అమ్మా-నాన్న' నాటిక వేస్తాం అన్నారు. అమ్మా-నాన్న నాటికను మేమే వేస్తాం అని ఇంకొందరు గోల చేశారు ఎలాగో చివరికి వాళ్ళలో వాళ్ళే సర్దుకున్నారు.

మాస్టారేసిన పిల్ల ముందుకొచ్చి ఇప్పుడు మీరు 'అమ్మా-నాన్న' నాటిక చూస్తారు. అని పక్కకు తప్పుకుంది.

మళ్ళీ మరోనాటిక ప్రారంభం అయింది. నాలో ఆసక్తి బాగా పెరిగింది శ్రీమతి పిలుస్తున్నా కదలకుండా అలాగే నుంచుని చూస్తున్నాను. ఇద్దరమ్మాయిలు ముందుకొచ్చారు వారిలో ఒకమ్మాయి రాగానే పుస్తకాల బేగు తల క్రిందపెట్టుకొని " ఒసేయ్ కాంతం! కాంతం! ఎక్కడచచ్చావే? ఎంత పిలుస్తున్నా తగలడవూ?" అంటోంది.

ఔరా! ఈ పిల్ల మధ్య తరగతి మాటల్ని ఎంత బాగా స్టడీ చేసింది? అనిపించింది నాకు.

" వస్తున్నానండీ! ఏం కొంపమునిగిందనీ అలా గొంతుచించుకుంటున్నారు?" అని వచ్చింది పెళ్ళాంగా నటిస్తున్న ఆ పిల్ల ముఖంలో బోలెడు అలసట. అంతకు మించిన చిరాకూ కనిపిస్తుంది. "కాళ్ళు తెగసలుపు తున్నాయి ఒక సారి రాసిపెట్టు" అంది భర్తగా నటించిన అమ్మాయి "ఉదయం

నుండి ఎడతెరపి లేకుండా ఏనే పని! నాకూ సలుపుతున్నాయి. మరి నేనెవర్ని పట్టమనాలి?" అందాపిల్ల

" అయితే నన్ను పట్టమంటావటే?" అరచింది మొగుడు వేషం వేసిన పిల్ల.

"ఏం! పడితే తప్పా? మీ కళ్ళు నేను పట్టటం లేదా?

"ఏం కూసావే? నా కాళ్ళు నువు పడితే నీ కాళ్ళు నేను పట్టాలా? ఎంత పొగరే నీకు. పెద్దంతరం, చిన్నంతరం లేకుండా ఎంత మాటన్నావే? ఏం లక్షల కట్నం తెచ్చావనే నీ కంతపొగరూ?" అని కాళ్ళ దగ్గర కూర్చోబోతున్న ఆ పెళ్ళాన్ని మొగుడు కాల్తో ఒక్క తాపుతన్నాడు.

ఆమె క్రింద పడిపోయింది. తలకి దెబ్బ తెగిలి ఏడుస్తుంది. "లే నోరు మూసుకో వచ్చి కాళ్ళుపట్టు ఏడుపు వినిపించిందంటే పీక నొక్కి అవతలకి విసరీగల్ను అన్నాడు.

ఆమె తనివి తీరా ఏడ్చే స్వతంత్రత లేక చిల్లుపడిన నిండుకుండకి గుడ్డ పీలిక అడ్డం పెట్టినట్లు నోట్లో పైట కొంగు కుక్కుకొని కాళ్ళొత్త సాగింది. అక్కడికి ఆ నాటిక ముగిసినట్లుంది. ఆ పిల్లలు లేనిపోయారు అందరూ చప్పట్లు కొడుతున్నారు. ఇంతలో మరో ఇద్దరు వచ్చారు.

ఓ పిల్ల పుస్తకాలను పొయ్యిలా పేర్చింది. పొయ్యిలో కర్రలు పెట్టి ఊదుతుంది. ఇంతలో ఓ మగాడు అంటే దాని మొగుడు కాబోలు వచ్చాడు. వాడి చేతిలో ఓ సీసావుంది.

"ఓలే నచ్చి మాసెడ్డాకలిగావుందే! కూడెట్టే "అన్నాడు వాడు.

"ఓస్ మగాడు మింగమెతుకునేదు మీసాలకి సెంపంగి నూనె అని ఈడి పోజుకు కూడు కావాలంట ఏటి ఏటి? పది రూపాయలు తెచ్చి పెళ్ళాం చేతిలో పెట్టినోడుకైనా ఆ పోజునేదే" అంటూ ముద్దుగా మూతి తిప్పిందా అమ్మాయి.

"ఏటి పేల్తన్నావ్, నిన్న నీ సేతపదిరూపాయల నోటెట్టలేదేటే?"

"ఏం నిన్న కూడు నువ్వు తినలేదా?

"ఏటి మాట మాటకి జవాబిత్తన్నావ్, ఏటొల్లంత కొవ్వెక్కినాదేటి" అని పొయ్యిలోంచి ఓ కర్ర తీసి దబీమని ఓ దెబ్బ వేశాడు మగడు. భార్య నెత్తీ నోరూ మొత్తుకుంటుంది. నోటికొచ్చిన శాపనార్థాలు పెడుతుంది. ఆ మగాడేమో గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు.

అక్కడితో అది ముగిసిందనుకుంటుండగా రామం మాస్టారు వీధిలోంచి వచ్చారు. పిల్లల ఆటలు ఆగిపోయాయి. అక్కడితో ఆ నాటికలు ముగియకపోతే ఆ లేత హృదయాలకి పడిన ఇంకెన్ని చిల్లులు చూడవలసి వుండేదో?

మళ్ళీ శ్రీమతి పిలుపు వినిపించేసరికి నేనూ అక్కడనుంచి భారంగా లేచి ఇంట్లోకి వెళ్ళి పోయాను!

(ఈనాడు ఆదివారం సంచిక 28-8-1989)